క్లుప్తంగా

ఆకట్టుకున్న బుర్రకథ



బుర్రకథ ప్రదర్శిస్తున్న కళాకారులు

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ అమ్మవారి 61వ వార్షిక మహోత్సవాల్లో ఆదివారం రాత్రి అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనలో శ్రీలక్ష్మీ గణపతి బృందం దేవిశ్రీ పార్టీ విజయనగరం వారిచే ప్రదర్శించబడిన వెరైటీ బుర్రకథ ప్రేక్షకులను అలరించింది. అనంతరం తొమ్మిది గంటలకు ఏర్పాటు చేసిన ఉషోదయ నాట్యమండలి చెరుకుపల్లి వారిచే ప్రదర్శించబడిన మోహిని భస్మాసుర నాటకం ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో ఎమ్మెల్సీ గోపిమూర్తి



ఆలయ ప్రాంగణంలో ఉన్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి దర్శించుకున్నారు. వీరికి ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్ శేష వస్త్రం ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా అమ్మవార్ల జాతర మహోత్సవం

భీమవరం(ప్రకాశంచౌక్): గునుపూడి గ్రామ దేవతలు ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి పోలేరమ్మ అమ్మవార్ల 34వ, జాతర మహోత్సవం ఆదివారం గ్రామోత్సవ ఊరేగింపుతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా 18వ, వార్డు పేరంటాల చెరువు గట్టు వద్ద రజక కుటుంబాల వారు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. డప్పు వాయిద్యాలు, సన్నాయి మేళం, గరగ నృత్యాలు, బుట్ట బొమ్మలు, అమ్మవారి ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సీతారామాంజనేయ రాజు, ఆదిలక్ష్మి రజక సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, వీరా హరిబాబు, అల్లు శ్రీనివాస్, అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వారం రోజులు నిర్వహించే జాతర మహోత్సవాలకు దాతలు, భక్తులకు గునుపూడి స్థానికులకు, ప్రజా ప్రతినిధులకు పలు శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నేదునూరి గంగాధర్ తిలక్, దొమ్మేటి సుబ్బయ్య, కొల్లేటి అయ్యప్ప, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత పశువైద్య శిబిరాలు

ఆకివీడు: మండలంలో ఈ నెల 20వ తేదీ నుంచి ఉచిత పశువైద్య శిబిరాలను ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేయనున్నట్లు మండల పశు వైద్యాధికారిణి భార్గవి సత్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువులకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గొర్రెలకు నట్టల నివారణ మందు, ఆవులు, గేదెలకు జలగ నివారణ మందు పంపిణీ చేస్తామన్నారు. పశువులకు ఇతర వ్యాధులను పరీక్షించి, తగిన మందులు, ఇంజక్షన్లు చేయనున్నట్లు తెలిపారు. గర్భకోశ వ్యాధులకు టీకాలు వేయనున్నట్లు చెప్పారు. మండలంలోని పెదకాపవరం గ్రామంలో సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. అన్ని గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



సిద్ధాంతం నక్కా వారి పాలెంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం నక్కావారి పాలెంలో మావుళ్లమ్మ జాతర మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలో అమ్మవారి ప్రతి రూపాలు, పల్లెటూరి అందాలు, సంక్రాంతి సందళ్లు, సనాతన ధర్మ విశిష్టత ప్రతిబింబించే విధంగా మహిళలు ముగ్గులు వేశారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

పాలకొల్లు అర్బన్: పట్టణ పరిధిలోని బెల్ట్‌షాపు ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న జె.ముసలయ్యనాయుడిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. నిందితుడి దగ్గర నుంచి 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్సైలు పి.మహేష్, జి.రఘు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని వేధిస్తున్న సిబ్బంది కొరత



వీరవాసరం పీహెచ్‌సీ



పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది వివరాలు

అందని వైద్య సేవలు.. రోగుల సతమతం

వీరవాసరం: ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తామని చెబుతున్న ప్రభుత్వం మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోతుంది. మండల కేంద్రమైన వీరవాసంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిత్యం 100 నుంచి 150 మంది ఔట్ పేషెంట్లు వైద్య పరీక్షల కోసం వస్తుంటారు. నిత్యం పని చేసే ఆసుపత్రిలో పూర్తి స్థాయి సిబ్బంది లేక ఉన్న సిబ్బందిపైనే అధిక భారం పడుతూ వైద్య సేవలు అందజేస్తున్నారు. వీరవాసరం పీహెచ్‌సీకి రాయకుదురు, చింతలకోటి గరువు, వీరవల్లివారి పాలెం, నడపనవారి పాలెం, తోకలపూడి, పంజా వేమవరం, వడ్డిగూడెం, నందమూరి గరువు, పెరికిపాలెం, బాలేపల్లి, బొబ్బనపల్లి, మెంటేపూడి, మత్స్యపురి, మత్స్యపురిపాలెం గ్రామాల నుంచి పెద్దఎత్తున వైద్య సేవలు పొందడానికి వస్తూ ఉంటారు. 24గంటలు పనిచేసే ఈ ఆసుపత్రిలో ముఖ్యంగా ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు (డాక్టర్లు) ఉండాలి. అయితే ఎనిమిది నెలల క్రితం పీహెచ్‌సీ వైద్యుడు సత్యనారాయణరాజు పదవీ విరమణ చేయడంతో అప్పటినుంచి ఇప్పటివరకు మరో వైద్యుడిని నియమించలేదు. ఉన్న మెడికల్ ఆఫీసర్ ఒక్కరితోనే ఆసుపత్రిని నడిపిస్తున్నారు. ముఖ్యంగా ఉండాల్సిన పీహెచ్‌ఎన్ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య పరీక్షల అనంతరం ప్రిస్క్రిప్షన్ రాసిస్తారు. వైద్యులు రాసిచ్చిన చీటీని తీసుకుని ఫార్మాసిస్టు దగ్గరికి వెళితే టాబ్లెట్లు తీసి ఇస్తారు. అటువంటి ఫార్మసిస్ట్ కూడా లేకపోవడంతో ఏఎన్‌ఎంలతో నడక నడిపేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్నిటి కన్నా ముఖ్యమైన రెండో మెడికల్ ఆఫీసర్ (డాక్టర్) పోస్టు, ఆసుపత్రి నిత్యం పరిరక్షణ చేసే పీహెచ్‌ఎన్ పోస్టు, డాక్టర్ రశీదు ద్వారా టాబ్లెట్లు అందించడానికి ఉండే ఫార్మసిస్ట్ పోస్టు కూడా ఖాళీగా ఉండడంతో ఈ భారం అంతా మిగిలిన సిబ్బందిపై పడుతుందని సిబ్బంది వాపోతున్నారు.

సిబ్బందిని నియమించాలి

వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలి. రోగులకు సత్వర సేవలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి. వ్యాక్సిన్లు, మందుల కొరత లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

– కందుల సురేష్, వీరవాసరం

సమస్యలకు మూలం బలవంతపు సంస్కరణలే



నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న పలు సంఘాల నాయకులు

భీమవరం: ప్రజలపై బలవంతంగా రుద్దిన సంస్కరణల ఫలితమే నేడు ప్రజలకు ఎదురవుతున్న సమస్యలకు మూలమని రైతు కార్మిక సంఘాల నేతలు ధ్వజమెత్తారు. భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో ఆదివారం కార్మిక, రైతు, వ్యవసాయ, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ నూతన ఆర్థిక విధానాల పేరుతో తీసుకొచ్చిన సంస్కరణలు ప్రజలకు ఉపయోగపడకపోగా అనేక కష్టాలు, కడగండ్లకు గురి చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలకులు దేశాన్ని నాశనం చేశారంటూ ఆరోపణలు చేసిన బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లు గడిచిపోయినా సమస్యలు పరిష్కరించలేకపోయారని విమర్శించారు. ధరలు తగ్గించలేకపోవడం, ఉపాధి కల్పించలేకపోవడానికి కారణాలు చెప్పలేని స్థితిలో నేటి పాలకులు ఉన్నారని దుయ్యబట్టారు. ఈ సంస్కరణలకు వ్యతిరేకంగా దేశంలో అనేక పోరాటాలు చేసి, రైతులు, కార్మికుల ప్రాణాలు అర్పించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటాల ఫలితమే జనవరి 19 కార్మిక కర్షక ఐక్యత దినం ఏర్పడిందని బాబూరావు, సత్యనారాయణ చెప్పారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ మాట్లాడుతూ ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు అమలు చేయడం వల్లనే జిల్లాలో అనేక పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ప్రజలకు అందుబాటులో ఉన్న పౌర సేవలు నేడు డబ్బులిచ్చి కొనుక్కోవలసిన దుస్థితి ఏర్పడిందని ఇవన్నీ పాలకులు తీసుకొచ్చిన సంస్కరణలలో భాగమేనన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాతిరెడ్డి జార్జి అధ్యక్షత వహించగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు బి.వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు, నారాయణరావు, రాము, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

దానేశ్వరి అమ్మకు ప్రత్యేక పూజలు



దానేశ్వరి అమ్మవారు



కుంకుమ, పసుపును ప్రదర్శనగా తీసుకెళుతున్న మహిళలు

ఆకివీడు: స్థానిక దానేశ్వరి అమ్మవారికి ఆదివారం మహిళలు భారీ స్థాయిలో పసుపు, కుంకుమార్చనలు చేశారు. మాదివాడ గంగానమ్మ ఆలయం నుంచి మహిళలు ప్లేట్లలో 160 కేజీల కుంకుమ, పసుపును తీసుకుని ప్రదర్శనగా దానేశ్వరి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో మహిళలు స్వయంగా అర్చన కార్యక్రమంలో పాల్గొని తమకు సౌభాగ్యం కల్గించాలని ప్రార్థించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

భీమవరం: టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో నల్లంవారితోట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గునుపూడికి చెందిన పాకెర్ల చిన్నయ్య గాయపడినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ చెప్పారు. చిన్నయ్య నడిచి వస్తుండగా వ్యాన్ ఢీ కొనడంతో గాయపడి భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందు తుండగా ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో అతని భార్య రేణుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

గాదిరాజు బాబుకు పితృవియోగం





గాదిరాజు బాబును పరామర్శిస్తున్న ప్రముఖులు, (అంతర చిత్రం) గాదిరాజు సోమరాజు (ఫైల్)

భీమవరం: డీఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) తండ్రి గాదిరాజు సోమరాజు (94) ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య కాంతమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు బాబు ఉన్నారు. సోమరాజు ఆర్‌అండ్‌బీ శాఖలో సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పని చేసి 1989లో పదవీ విరమణ చేశారు. సోమరాజు మృతదేహాన్ని మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజు, గోకరాజు రామరాజు, గోకరాజు పాండు రంగరాజు, మెంటే పార్థసారథి, తదితరులు సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బస్ స్టాప్‌ల నిర్మాణానికి స్థల పరిశీలన



బస్ డిపో వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన డిజైన్లను త్వరితగతిన పూర్తి చేసి అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద, ఆర్టీసీ డిపో వద్ద, బస్ స్టాప్‌ల నిర్మాణాలకు స్థలాలను పరిశీలించారు. వీటికి సంబంధించిన డిజైన్లను రూపొందించి రానున్న రెండు రోజుల్లో అందజేయాలని మున్సిపల్ సర్వేయర్లను ఆదేశించారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా బస్టాప్ నిర్మాణ వ్యయాన్ని భీమవరం హాస్పిటల్స్ యాజమాన్యం, ఆర్టీసీ డిపో వద్ద బస్ స్టాప్ నిర్మాణానికి ఐఎంఏ నుంచి నిధులను సమకూరుస్తామని తెలిపారు. అనంతరం హౌసింగ్ బోర్డ్‌లోని కళావేదిక పార్కు అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఇప్పటికే రూ.10 లక్షల వ్యయాన్ని పార్కు అభివృద్ధికి రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఖర్చు చేసిందని, మరి కొన్ని కళాకృతుల ఏర్పాటుకు వెంటనే మార్కింగ్స్ ఇవ్వాలని మున్సిపల్ సర్వేయర్‌ను ఆదేశించారు. ఓల్డ్ బస్టాండ్ పునఃనిర్మాణానికి వెంటనే డిజైన్‌లను రూపొందించి నిర్మాణ దాతకు అందజేయాలని భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌ను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణమూర్తి, మున్సిపల్ ఇంజనీర్ త్రినాథరావు, ఐఎంఏ ప్రతినిధి సీహెచ్ కృష్ణంరాజు, చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, జానపాటి మధుసూధన్ రావు, దిలీప్, మున్సిపల్ సర్వేయర్ రమాబాయి, ఏసీపీ శ్రీలత, టీపీఓ పార్థసారథి, టీపీఎస్ శాస్త్రి, ఏఎంసీ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజనాలను సంరక్షించాలి



బడుగు బాలాజీ

ఉండి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాలను సంరక్షించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి బడుగు బాలాజీ పత్రికా ప్రకటనలో ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ దోపిడీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నాగం పన్నుతున్నాయని తెలిపారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో రూ.10వేలకోట్లు ఇచ్చి ప్రత్యేక హోదా ఎగ్గొట్టిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు కూడా స్టీల్‌ప్లాంట్ విషయంలో అదే ధోరణి కొనసాగిస్తుందని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రస్తుత విలువ రూ.2 లక్షలకోట్ల పైబడి ఉంటే కేంద్రం మాత్రం రూ.7686 కోట్లుగా విలువ కట్టడంలో ఆంతర్యమేమిటో తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇదంతా చూస్తుంటే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాజేసే ఎత్తుగడలా ఉందని ఆరోపించారు. ఈక్విటీ పార్టిసిపేషన్ పేరు మీద ఎన్‌డీ ఏ ప్రభుత్వం ఇచ్చే రూ.10.30 వేల కోట్లు 57 శాతం వాటాగా తేల్చి తరువాతిరోజుల్లో ప్రైవేట్ కంపెనీలకు విశాఖ ఉక్కును ధారాదత్తం చేయడం కాదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో విశాఖ స్టీల్స్‌ను అమ్మనీయం అంటూ నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేయడంతో దానిని నేరుగా అమ్మేందుకు అవకాశం లేక కేంద్రం కూటమి ప్రభుత్వంతో లాలూచీకి దిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రంతో కలిసి చంద్రబాబు దెబ్బ తీస్తున్నారని బాలాజీ ఆరోపించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలను వేధిస్తే సహించం



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: అధికార దాహంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హెచ్చరించారు. పాలకొల్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంగా నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. గ్రామాల్లో చిన్న ఫ్లెక్సీ గొడవను సాకుగా తీసుకుని పోలీస్ స్టేషన్లకు పిలిపించి వేధింపులకు గురిచేస్తున్నారని, ఇదంతా మంత్రి నిమ్మల కనుసన్నల్లోనే జరుగుతుందని ఆరోపించారు. అధికారం శాశ్వతం కాదని, ఇదే వైఖరి కొనసాగితే భవిష్యత్తులో రోడ్డెక్కి ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న 5 ఏళ్ల టీడీపీ నాయకులను గానీ, కార్యకర్తలను గాని వేధించలేదని గుర్తు చేశారు.

ఇన్‌చార్జ్‌ని మార్చే ఆలోచన లేదు...

పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ని మార్చే ఆలోచన లేదని తానే కొనసాగుతున్నట్లు గుడాల గోపి స్పష్టం చేశారు. పాలకొల్లులో కొంత మంది తనను ఇన్‌చార్జ్‌గా తప్పిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయనున్నట్లు వివరించారు. భవిష్యత్తులో పార్టీ ఇచ్చిన ఆదేశాల మేరకు కార్యక్రమాలన్నీ విజయవంతం చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు, చెన్ను విజయ్, గంటా నరేష్, జోగి వెంకటేశ్వరరావు, గంగిరెడ్ల ప్రసాద్, పాలపర్తి కృపానాథ్, పాలపర్తి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాగారమ్మ జాతర

నరసాపురం: పట్టణంలోని 31వవార్డు చినమామిడిపల్లిలో ఉన్న శ్రీ నాగారమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి అమ్మవారి సంబరం వైభవంగా నిర్వహించారు. బాణసంచా కాల్పులు, బుట్ట బొమ్మల ప్రదర్శనలు, వివిధ వినోద కార్యక్రమాలతో ఉత్సాహంగా సంబరం చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 26న అన్నసమారాధన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ముగిసిన సప్తాహ మహోత్సవాలు

నరసాపురం రూరల్: మండలంలోని సీతారాంపురంనార్త్ పంచాయతీలోని పట్టాభి రామాలయంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న సప్తాహ మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి వారికి పూర్ణాహుతి, సామ్రాజ్య పట్టాభిషేకం, శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు పూర్ణాహుతి హోమంలో పాల్గొని ప్రత్యేపూజలు చేశారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. సోమవారం ఉదయం అఖండ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు అందించాలని కోరారు.

ఎక్కడి చెత్త అక్కడే

పట్టించుకోని పంచాయతీ అధికారులు



వద్దిపర్రులో ఊరచెరువు వద్ద ఆర్‌అండ్‌బీ రహదారి పక్కనే చెత్తకుప్ప

పోడూరు: మండలంలో పలు గ్రామాల్లో రహదారులు, కాలువగట్ల పక్కనే చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. కొన్నిచోట్ల రోడ్డు మార్జిన్ వరకు చెత్తకుప్పలు ఉండడంతో పాదచారులు, ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల రోడ్లపక్కన ఉన్న చెత్తకుప్పల వద్దే కుక్కలు, పిల్లులు వంటి జంతు కళేబరాలను కూడా పారవేస్తుండడంతో రోడ్లపై ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రధానకాలువలు, డ్రెయిన్ గట్ల వెంబడి కూడా చెత్త నిల్వలు పోగవుతున్నాయి. ముఖ్యంగా గ్రామాలకు ప్రధాన తాగునీటి వనరులుగా ఉన్న పంట కాలువల పక్కన సైతం చెత్త, వ్యర్థాల నిల్వలు ఉండడంతో గ్రామాల్లో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిస్థితి ఇదీ

పోడూరు మండల పరిధిలో జిన్నూరు గ్రామం నుంచి వేడంగి, కవిటం జగన్నాథపురం గ్రామాల మీదుగా పాలకొల్లు-మార్టేరు స్టేట్ హైవే ఉంటుంది. అలాగే ఆయా గ్రామాల మీదుగా ఇదే మార్గంలో నరసాపురం ప్రధాన కాలువ ఉంది. అలాగే జగన్నాథపురం నుంచి పోడూరు, గుమ్మలూరు గ్రామాల మీదుగా రావిపాడు వరకు చించినాడ పంట కాలువ ఉంది. వీటితో పాటు మండల పరిధిలో కాజ డ్రెయిన్, భగ్గేశ్వరం డ్రెయిన్, మొగల్తూరు డ్రెయిన్, నక్కలకాలువ వంటి ప్రధాన మురుగుకాలువలు ఉన్నాయి. ఈ కాలువ గట్లు చెత్తతో నిండి ఉన్నాయి. అలాగే పాలకొల్లు-పెనుమదం, కవిటం-కొమ్ముచిక్కాల, కవిటం-పైడావ, పోడూరు-మినిమించిలిపాడు, పోడూరు-పండితవిల్లూరు, పండితవిల్లూరు-తూర్పుపాలెం, గుమ్మలూరు-వద్దిపర్రు గ్రామాల మీదుగా ఆర్‌అండ్‌బి రహదారులు ఉన్నాయి. ఇవే కాకుండా జెడ్పీరోడ్లు, గ్రామాల మీదుగా ప్రధాన రోడ్ల మార్జిన్స్‌లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.

డంపింగ్ యార్డులకు తరలించాలి

గతంలో డంపింగ్ యార్డులు లేనపుడు చాలాగ్రామాల్లో రోడ్లపక్కల చెత్తనిల్వలు ఉండేవి. ఇప్పుడు దాదాపు అన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. దీంతో రోడ్లపక్కన పోగుపడే చెత్త నిల్వలను కనీసం రెండు, మూడు రోజులకు ఒకసారైనా డంప్‌యార్డులకు తరలించడం ద్వారా ఇటువంటి పరిస్థితికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే రోడ్లపక్కన, పంట కాలువల పక్కన చెత్తపోగులు వేయకుండా ప్రత్యేకించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి చెత్తనిల్వలు పోగవకుండా నివారించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



రావిగొప్ప శివారులో ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన పోగుపడిన చెత్తకుప్ప



బండారువారి చెరువు వద్ద చించినాడ పంట కాలువ గట్టుపై చెత్తకుప్పలు